# ప్రతిపక్షాలకు డిపాజిట్లు గల్లంతే..

- మాది అభివృద్ధి మంత్రం.. వారిది కులమతాల కుతంత్రం
- బీఆర్ఎస్ అధికారంలోకి రావడం పక్కా..
- జనవరి తరువాత మ్యానిఫెస్టో అమలు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రచారం


ప్రచార రథంపై మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్‌టౌన్, నవంబర్ 26 : ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు కనీసం డిపాజిట్లు కూడా దక్కవని మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ నుంచి జిల్లా సెంట్రల్ లైబ్రరీ సమీపంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు ప్రజలు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ, దుకాణాల వద్ద తిరిగి బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో ఊహించని విధంగా అభివృద్ధి చేసిన తమకే ప్రజలంతా అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. రాత్రికి రాత్రి బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యక్తి వల్ల గతంలో మతకలహాలు జరిగాయని, ఆ వ్యక్తే ఇప్పుడు కులాల కుంపట్లు రాజేసి ఓట్లు పొందాలని చూస్తున్నాడని మంత్రి విమర్శించారు. పాతకలెక్టరేట్ వద్ద నిర్మితమవుతున్న వెయ్యి పడకల దవాఖాన అభివృద్ధికి మచ్చుతునక మాత్రమేనన్నారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన మ్యానిఫెస్టోలోని ప్రధానాంశాలైన దివ్యాంగులకు రూ.6,016, ఆసరా రూ.5,016, సన్నబియ్యం, పేద మహిళలకు రూ.3వేల జీవనభృతి, ప్రతికుటుంబానికి రూ.5లక్షల జీవిత బీమా, రూ.400కే సిలిండర్ తదితర పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. మహబూబ్‌నగర్‌ను అన్ని విధాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ప్రజలంతా సహకరించి ఎన్నికల్లో ఆఖండ విజయం సాధించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు క్రిస్టియన్‌పల్లి మార్నింగ్ వాక్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కౌన్సిలర్ షేక్‌ఉమర్, మాజీ కౌన్సిలర్ పద్మజా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నటరాజ్, నరేందర్ పాల్గొన్నారు.

### మాది అభివృద్ధి మంత్రం

మహబూబ్‌నగర్‌టౌన్, నవంబర్ 26 : మాది అభివృద్ధి మంత్రం వారిది కులమతాల కుతంత్రం అని మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం సద్దలగుండు, హబీబ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో పదేళ్లలో ఊహించని అభివృద్ధి చేశామని, ఐటీపార్కు ఏర్పాటు చేశామని తెలిపారు. హిందూ, ముస్లింలు కలిసి వన్‌బైటూ చాయ్ తాగేలా ఇప్పుడు పరిస్థితులు ఉన్నాయి. ప్రశాంతత, శాంతి సామరస్యం భవిష్యత్తులోనూ కొనసాగాలంటే మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనార్టీ ముఖ్య నాయకుడు జహంగీర్ తన అనుచరులు వంద మందితో తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముడా డైరెక్టర్ సాయిలు, జాబేర్‌బిన్‌సయీద్, విక్రమ్‌దేవ్, అల్తాఫ్ పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

అధికారంలోకి వచ్చిన వెంటనే

# మహిళలకు సాయం

- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఆగమే
- ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి


గంగాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నవంబర్ 26 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఇంట్లోని అత్తాకోడళ్లకు ఆర్థిక సాయం అందుతుందని జడ్చర్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం జడ్చర్ల మండలం పోలేపల్లి, మాచారం, గంగాపూర్, నెక్కొండ, అమ్మపల్లి, గోప్లాపూర్, లింగంపేట, కొండేడు, కుర్వపల్లి, గైరాన్‌తండా, మొరంబాయితండా, లక్ష్మణ్‌నాయక్‌తండా, మక్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి అన్ని గ్రామాల్లో మహిళలు బోనాలతో వచ్చి మంగళహారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటికే వృద్ధులకు పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని, బీద మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా కోడళ్లకు రూ.3వేల ఆర్థిక సాయం అధికారంలోకి రాగానే అందజేస్తామని, ఒకే ఇంట్లో అత్తాకోడళ్లకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందని, ఇప్పుడు అమలవుతున్న పథకాలన్నీ నిలిచిపోతాయన్నారు. ఆరు గ్యారంటీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నరాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలో కూడా మన రాష్ట్రంలో ప్రకటించిన పథకాలు అమలవుతున్నాయా అని ప్రశ్నించారు. 3గంటల విద్యుత్, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెస్ చెబుతుందని, అది రైతులకు సాధ్యమవుతుందా అని పేర్కొన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. అదేవిధంగా మండలంలోని మాచారం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, సర్పంచులు రవీందర్‌రెడ్డి, చేతన్‌రెడ్డి, కళికగోపాల్, ఆంజనేయులు, హైమావతి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ముడా డైరెక్టర్ ఇంతియాజ్‌ఖాన్, రంజిత్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, ఎక్‌నాథ్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

# మళ్లీ ఆ రోజులు రావద్దు

- కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


దేవరకద్ర : జీనుగరాలల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర, నవంబర్ 26 : అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డామని, మళ్లీ అరోజులు రావద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని డోకూర్, జీనుగరాల, బస్వాయిపల్లి, చిన్నరాజమూర్, కోయిల్‌సాగర్, దేవరకద్ర పట్టణంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల పాలుజేయొద్దని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని చెప్పారు. కానీ 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పాలనలో నీళ్లు, కరెంటు లేక అష్టకష్టాలు పడ్డామని గుర్తుచేశారు. సీఎం సహకారంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. బస్వాయిపల్లి గ్రామంలో బీటీ రోడ్ నిర్మాణంతోపాటు గ్రామంలోని చెరువులను మిషన్ కాకతీయ ద్వారా పూడికతీత తీశామన్నారు. జీనుగురాలలో రూ.28కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని, గ్రామంలో భూమిలేని ఎనిమిది మంది దళిత కుటుంబాలను గుర్తించి వారికి 23 ఎకరాల 10 గుంటల భూమిని అందించామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో రైతులకు సరైన సమయంలో రైతుబంధు అందుతుండంతో రైతులు సంతోషంగా ఉంటే కాంగ్రెస్ నాయకులు చూడలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, సర్పంచులు సుజాత, శ్రీనివాస్, శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ తిరుపతయ్య, సహకార సంఘం అధ్యక్షుడు డోకూర్ నరేందర్‌రెడ్డి, మూడా డైరెక్టర్ కర్ణంరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ, వెంకటేశ్, మండల కోఆప్షన్ ఖదీర్, మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ఉప్పరి సత్యంసాగర్, భాస్కర్‌గౌడ్, కొండ శ్రీనివాస్ రెడ్డి, జలెందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీధర్‌గౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

# గెలుపునకు పాటుపడాలి


బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, నవంబర్ 26 : పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పాటుపడాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ధన్వాడ మండలం గున్ముక్ల గ్రామానికి చెందిన 60 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా పిల్లిగుండ్ల తండా కు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులను నమ్మరాదన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# టెన్షన్ వద్దు.. కారుకు ఓటెయ్..

- బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం
- బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు
- త్వరలోనే రైతుబంధు డబ్బులు జమ
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబర్ 26 : ఇన్నాళ్లు కండ్లబడని వారందరూ ఊర్లకు వచ్చి ఓట్లు అడుగుతుంటే టెన్షన్ పడకండి, కారు గుర్తుకు ఓటేసి మా వెనకాల కేసీఆర్ ఉన్నాడని చెప్పాలని బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జూరాల, గుంటిపల్లి, మొట్లంపల్లి, మేడేపల్లి, దేవరపల్లి, తిప్డంపల్లి, రేచింతల, వీరరాఘవపూర్, తూంపల్లి, కత్తెపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన రోడ్‌షో సభలో ఆయన మాట్లాడుతూ 60 ఎండ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో భూములు బీడుపడి ఉండేవని, రైతులు కూలీలు వలసలు పోవడంతో ఇండ్లకు తాళాలు కనిపించేవి, పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన మార్పును ప్రజలు గుర్తించాలన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతితో పల్లెల్లో జరిగిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అమలుకాని స్కీములు, స్కాములన్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ ప్రజల గుండెచప్పుడు, భరోసా అని పేర్కొన్నారు. ఎన్నికలయ్యాక కండ్లకు కూడా కనిపించకుండా పారిపోయే పార్టీలకన్నా నిత్యం మీ మధ్యనే ఉంటూ మీ మంచిచెడులు చూసుకుంటూ ఉండే బీఆర్ఎస్ పార్టీకే ఓటేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా ఎలక్షన్ కమిషన్ రైతుబంధు డబ్బుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. త్వరలోనే రైతుబంధు డబ్బులు విడుదల చేస్తామని, నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే ఎప్పటిలాగా డబ్బులు పడతాయన్నారు. కారు గుర్తుకు ఓటేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఆత్మకూరు ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేరుస్తానని హామీనిచ్చారు. ప్రచార పర్వంలో భాగంగా ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే చిట్టెం రామన్నకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, జెడ్పీటీసీ శివరంజని, పీఏసీసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


తిప్డంపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి